క్లుప్తంగా

పీహెచ్‌సీలో విచారణ



పీహెచ్‌సీలో విచారణ చేపడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగ నిర్మల

సాక్షి ఎఫెక్ట్

హత్నూర (సంగారెడ్డి): చింత్ చెరువు పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగనిర్మల విచారణ చేపట్టారు. శుక్రవారం వైద్యులు ఉండరు.. వైద్యం అందదు.. పేరిట సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆమె.. చింతల్ చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నేత్రపతి సిబ్బందితో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవిని ఫోన్‌లో సాక్షి సంప్రదించగా విచారణ నివేదికను పరిశీలించి శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. పూర్తి స్థాయి నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇంటెలిజెన్స్ అధికారులు సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి విచారణ చేశారు. వారు సైతం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు నిరసనకు దిగారు. విధులను బహిష్కరించి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ పారిశుధ్య, వాటర్ సప్లయి, ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు నెల జీతంపై ఆధారపడి ఉన్నారన్నారు. చాలీచాలని వేతనంతో పని చేస్తున్న కార్మికులకు వాటిని సకాలంలో అందక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. జనవరి, ఫిబ్రవరి రెండు నెలలకు సంబంధించిన జీతాలు రావాల్సి ఉందన్నారు. ఆస్తి పన్ను వసూలు కానందున జీతాలు ఇవ్వమని చెప్పడం శోచనీయమన్నారు. తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కామయ్య, యశోదమ్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భార్య ప్రతిమతో వివాహ వార్షికోత్సవం



భార్య ప్రతిమతో భర్త సత్యనారాయణ

జిన్నారం(పటాన్‌చెరు): అనారోగ్యంతో భార్య మృతి చెందింది. దీంతో ఆమె ప్రతి రూపాన్ని ఏర్పాటు చేసి వివాహ వార్షికోత్సవాన్ని జరిపించిన ఉదంతం జిన్నారం మండలంలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.. గుమ్మడిదల గ్రామానికి చెందిన చెన్నంషెట్టి సత్యనారాయణ, నాగలక్ష్మిల వివాహం జరిగి 49 ఏళ్లు అయ్యింది. 50వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆశపడ్డారు. గత ఏడాది ఫిబ్రవరి 5న ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారంతో వీరి వివాహం జరిగి 50 ఏళ్లు అవుతుండటంతో అమ్మ, నాన్నల కోరికను తీర్చాలని కుమారులు కోటేశ్వర్‌రావు, జయసారధి, సూర్యనారాయణ, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్ తలచారు. ఏకంగా అమ్మ ప్రతిమను రూపొందింపజేశారు. తల్లిదండ్రుల వార్షికోత్సవాన్ని జరిపించారు.

చైర్మన్, వైస్ చైర్మన్లకు సన్మానం



చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నారాయణఖేడ్: స్థానిక మున్సిపల్ నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన ఆనంద్ స్వరూప్ షెట్కార్, దారం శంకర్‌లను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. సన్మానించిన వారిలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు భీంసేన, పుష్పాల అశోక్ తదితరులు ఉన్నారు.



ఝరాసంగం(జహీరాబాద్)లో..



పటాన్‌చెరులో...



కోహీర్(జహీరాబాద్): జీరో బిల్లులను అందజేస్తున్న విద్యుత్ సిబ్బంది

గృహజ్యోతి పథకం షురూ

సాక్షి, నెట్‌వర్క్ : గృహజ్యోతి పథకాన్ని అర్హులకు వర్తింపజేస్తున్నారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా వినియోగదారులకు జీరో కరెంట్ బిల్లులు తీసి అందజేశారు. ఆ బిల్లులు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరలా ఆహార భద్రత కార్డు, ఆధార్ తదితరాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమాల్లో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాయికోడ్‌లో..

నీటి ఎద్దడి రానివ్వొద్దు : ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవర్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): వేసవి కాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో, తండాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రత్యేక చొరవతో పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ ద్వారా కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. త్వరలోనే ఎన్‌ఏపీ పథకాలు పూర్తిస్థాయిలో మళ్లీ వినియోగంలోకి వస్తాయన్నారు. పాఠశాలల్లో మన ఊరు–మన బడి ద్వారా చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన విద్యార్థులకు అందజేయాలన్నారు. పాఠశాలల సమస్యలపై పలువురు ఎంపీటీసీలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే డీఈఓతో మాట్లాడారు. త్వరలోనే నియోజకవర్గంలో విద్యపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశానికి ఎంపీపీ రాథోడ్ మోతిబాయి అధ్యక్షత వహించారు. సమావేశంలో తహసీల్దార్ షినాబీ, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్ అండ్‌బీ డిప్యూటీ ఈఈ రాము, జెడ్పీటీసీ రాథోడ్‌రాజు, ఎంపీటీసీలు పండరి తదితరులు పాల్గొన్నారు.



జేపీ నడ్డాను కలిసిన ఎంపీ పాటిల్

జేపీ నడ్డాను కలిసిన ఎంపీ పాటిల్

జహీరాబాద్: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. శుక్రవారం బీఆర్ ఎస్ కు రాజీనామా చేశాక ఢిల్లీలో ఆపార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జాతీయ నాయకుడు తరుణ్ చుగ్ సమక్షంలో కమలం పార్టీలో చేరారు. అనంతరం నడ్డాను కలిశారు. పార్టీలో చేరికను ఆయన స్వాగతించారు.

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరిన సందర్భంగా పట్టణంలో గురువారం రాత్రి ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో టపాసులు కాల్చారు. సిద్దపురం అరుణ్‌కుమార్, అక్షయదేశ్‌పాండే, బక్కన్న, అరుణ్, నాగరాజ్, నరేష్‌స్వామి, సందీప్, చైతన్, రామన్నలు ఉన్నారు.



దెగుల్‌వాడిలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యయ్య, ఏపీఓ నర్సింహులు

ఉపాధి పనులు ముమ్మరం

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత నెలలో ప్రారంభమైన పనుల్లో ముఖ్యంగా రాతి కట్టలు, వరద కాల్వల తవ్వకం పనులు చేపడుతున్నారు. పర్యవేక్షణలో భాగంగా ఎంపీడీఓ ఎం. సత్యయ్య శుక్రవారం దెగుల్‌వాడిలో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. కూలీలు ఎక్కువ వేతనాలు పొందేందుకు చేయాల్సిన పనులపై సూచనలు చేశారు. ప్రస్తుతం 2 వేల మందికి పైనే పనులు చేస్తున్నారన్నారు. అధికంగా తడ్కల్, రాంతీర్థ్, జమ్గి(కే), జమ్గి(బీ), బోర్గి, దెగుల్‌వాడి గ్రామాల్లో కూలీలు పనులకు వస్తున్నట్లు ఏపీఓ నర్సింహులు తెలిపారు. 6 వేలకు పైగా జాబ్ కార్డుదారులుండగా తక్కువ మంది హాజరు కావడం పట్ల ఏపీఓ వివరణ కోరగా చాలా మంది కూలీలు వంద రోజుల పని పూర్తిచేశారన్నారు. ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌తో ప్రారంభం కానున్నందుకు అప్పుడు వారి సంఖ్య పెరుగుతుందన్నారు.



బస్ డిపోలో తరచూ చోరీలు

ఆందోళనలో ప్రయాణికులు

జహీరాబాద్: ఆర్టీసీ బస్‌డిపోలో తరచూ చోరీలు జరుగుతుండటంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. దొంగలు ముందస్తుగా ప్రయాణికుడి కదలికలపై నిఘా వేసి పథకం ప్రకారం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. రద్దీగా ఉండే బస్సు వద్ద సాధారణ వ్యక్తుల్లా ఎక్కుతున్నట్లు హడావిడి చేసి నగదును, సెల్‌ఫోన్లను అపహరిస్తున్నారు. కొందరు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయిస్తుండగా మరికొందరు నిమ్మకుండిపోతున్నారు. రెండు రోజుల క్రితం పట్టణానికి చెందిన ఓ వ్యాపారి జేబులో నుంచి నగదును అపహరించారు. సోదరుడి కుమార్తె పెళ్లి కోసం నగదును తీసుకెళుతున్న క్రమంలో దొంగలు కాజేసినట్లు వాపోయాడు. సంగారెడ్డి వరకు వెళ్లాక నగదు మాయమైనట్లు గుర్తించాడు. పక్కనున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారే దొంగతనాలకు పాల్పడుతుండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, ఆర్టీసీ అధికారులు డిపోలో ప్రత్యేక నిఘా వేసి దొంగతనాలు జరగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పది రోజుల్లో సమస్యలకు పరిష్కారం

'ధరణి' స్పెషల్ డ్రైవ్

ఝరాసంగం(జహీరాబాద్): ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. శుక్రవారం మండల పరిధిలోని మేదపల్లి, ఈదులపల్లి, మాచ్నూర్, కృష్ణాపూర్ గ్రామాల్లో ప్రత్యేక సభలను నిర్వహించారు. 10 రోజుల్లో సమస్యలు పరిష్కారమవుతాయని వెల్లడించారు.

రాయికోడ్ (అందోల్): మండల రెవెన్యూ అధికారులు 3 బృందాలుగా ఏర్పడి పలు గ్రామాల్లో ధరణి దరఖాస్తుల వివరాలను సేకరించారు. 20 దరఖాస్తుల వివరాలను పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

కంగ్టి(నారాయణఖేడ్): స్పెషల్ డ్రైవ్ ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విష్ణుసాగర్ తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, తన పరిధిలోని సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కరిస్తామన్నారు.

సంగారెడ్డి టౌన్ : గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతున్నారని తహసీల్దార్ దేవదాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంగారెడ్డి, ఇరిగిపల్లి, ఇస్మాయిల్ ఖాన్ పేట్ గ్రామాల్లో ప్రత్యేక సభలను నిర్వహించారు.



ఝరాసంఘం: ఈదులపల్లిలో నిర్వహిస్తున్న ధరణి స్పెషల్ డ్రైవ్

మునిపల్లి(అందోల్): తహసీల్దార్ తెన్‌మొళి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని మన్‌సాన్‌పల్లి, అల్లాపూర్ గ్రామాల్లో గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు. ఉప తహసీల్దార్ కృపాదానం ఆర్ఐ రవీందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 39 పోలియో కేంద్రాల ఏర్పాటు

రాయికోడ్(అందోల్): మండలంలో 39 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ వైద్య అధికారులు నిఖిల, చంద్రలీల తెలిపారు. ఈనెల 3న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నందున అదనంగా రాయికోడ్‌లో ట్రాన్సిస్ట్ కేంద్రాన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఒక్కో కేంద్రంలో నలుగురు సిబ్బందిని నియమించి బాధ్యతలు అప్పగించామన్నారు. మండలంలో 2,796 మంది ఐదేళ్ల లోపు పిల్లలున్నారన్నారు.

◆ ఘనంగా సైన్స్ దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సైన్స్ అకాడమీ తరఫున జాతీయ సాంకేతిక సంస్థ వరంగల్ విశ్రాంత ఆచార్యులు రామచంద్రయ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంతి ఆచార్యులు బీఎస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ చేసిన పరిశోధనలు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు యోగిబాబు శ్రీహరిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ కొండముచ్చుకు అంత్యక్రియలు



కొండముచ్చు పాడెను సిద్ధం చేస్తున్న గ్రామస్తులు, యువకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): కొండముచ్చు(కొండెంగ)కు అంత్యక్రియలు నిర్వహించిన ఉదంతం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం పలు కొండముచ్చులు గ్రామంలోని ప్రవేశించాయి. హన్‌మాన్ ఆలయం వద్ద ఇళ్లపై ఇటు అటు దూకుతుండగా ఒక కొండముచ్చుకు విద్యుత్ తీగలు తగిలి కింద పడిపోయి మృతిచెందింది. ఈ విషయాన్ని గమనించిన గ్రామ పెద్దలు, యువకులు, శివస్వాములు మృతి చెందిన హిందు సంప్రదాయం ప్రకారం పాడెపై మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జోగిపేట(అందోల్): ఇటీవల అందోల్ మండలం మాసానిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వాజీద్, ముక్రం, ఎండీ హాజీలు మృతిచెందగా.. వారి కుటుంబాలను టీఎస్‌టీపీసీ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి శుక్రవారం పరామర్శించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన మైనార్టీ కార్యకర్త వాజీద్ నాయకుడిగా ఎదుగుతున్న సమయంలో మనకు దూరమయ్యారన్నారు. జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కోఆప్షన్ సభ్యులు ఫైసల్, ఖలీల్, షకీల్, ఖాజా పాషా, అర్షత్, ఎండీ రఫీక్‌ల, పలువురు బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆పరీక్షల పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కావడంతో మండల విద్యాధికారి శంకర్, తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీఓ సత్యయ్య కంగ్టి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను పరిశీలించారు. ఈనెల 18న వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నందున మండలంలోని జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో సెంటర్లనూ పరిశీలించారు. ఆయా సెంటర్లలోని కల్పించాల్సిన సౌకర్యాలు, తీసుకోవాల్సిన చర్యలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్‌లో ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ ఉమశంకర్, ఎంపీడీఓ మల్సూర్, ఎంఈఓ శంకర్.. జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించారు. పరీక్షా కేంద్రం నిర్వహణ, వసతులపై పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కడ్పల్‌లో రేణుక ఎల్లమ్మ మందిరంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు మందిరంలో అమ్మను దర్శించుకున్నారు. అభిషేకాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూంరెడ్డి, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బీరంగూడ మండే మార్కెట్ సమీపంలోని శంభుని కుంటలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సుమారు 30 నుంచి 35 వయసు ఉంటుంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు... మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

మాచేపల్లి శివారులో ఘటన

కొండాపూర్(సంగారెడ్డి): ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రహదారి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన శుక్రవారం మండల పరిధిలోని మాచెపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి నుంచి సాయంత్రం మైతాబ్‌ఖాన్ గూడెంకు ఆర్‌టీసీ బస్సు బయలుదేరింది. మాచేపల్లి గ్రామ శివారులోకి రాగానే స్టీరింగ్ కంట్రోల్ కాకపోవడంతో రహదారి పక్కనే గల గుంతలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 96 మంది ఉన్నారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండటంతో అదుపు తప్పిందని కండక్టర్, డ్రైవర్ తెలిపారు. గుంతలోకి దూసుకెళ్లిన బస్సును స్థానికులు జేసీబీ సాయంతో బయటకు తీశారు. రహదారి కూడా గుంతలు ఏర్పడి కంకర తేలి ఉండటం కూడా ఒక కారణమని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

కోహీర్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. ఈ సంఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. కోహీర్ ఎస్సై క్రిష్ణయ్య కథనం ప్రకారం.. మనియార్‌పల్లి గ్రామానికి చెందిన బైండ్ల లక్ష్మయ్య(42) 2023 అక్టోబర్ 3న బంధువుల వద్దకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో బిలాల్‌పూర్ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడగా తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లాడు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ప్రయోజనం లేకపోవడంతో డాక్టర్ల సూచన మేరకు ఇంటి వద్ద చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించాడు.

హెచ్‌ఎంపై విచారణ

మనూరు(నారాయణఖేడ్): మండలంలోని పుల్‌కూర్తి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన హెచ్‌ఎం ప్రధానోపాధ్యాయుడి గోవింద్ నాయక్‌పై శుక్రవారం ఎంఈఓ శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్‌ఎం అంజిరెడ్డి విచారణ చేపట్టారు. దీంతో సదరు హెచ్‌ఎం ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలకు గైర్హాజరవుతున్నాడని రుజువైందన్నారు.



అందోల్‌లో...



జహీరాబాద్ టౌన్: మల్‌చెల్మ పాఠశాలలో..



జిన్నారం(పటాన్‌చెరు)లో..

మాక్ పోలింగ్ విజయవంతం

సాక్షి, నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, జెడ్పీ పాఠశాలల్లో మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ పోలింగ్‌లో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు? విధి నిర్వహణలో అధికారులు ఎలా వ్యవహరిస్తారు? ప్రజలు ఓటును ఎలా సద్వినియోగం చేసుకుంటారనే అంశాలను విద్యార్థులు చక్కగా నిర్వహించారు. ఎన్నికల అభ్యర్థిగా, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా, పోలింగ్ ఏజెంట్‌లుగా, బందోబస్తుకు పోలీసు సిబ్బందిగా విధులు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్నారు.



జిన్నారం(పటాన్‌చెరు)లో..



న్యాల్‌కల్: జెడ్పీహెచ్‌ఎస్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన విద్యార్థులు